ప్రజాశక్తి
ఆదివారం 16 ఫిబ్రవరి 2025
5
శ్రీ సత్యసాయి





బాలోత్సవంలో ప్రదర్శన చేస్తున్న అనంతపురం గాయత్రి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు



పాఠశాలలో మొక్క నాటుతున్న కలెక్టర్ చేతన్

పెడపల్లి ఉన్నత పాఠశాలను

మోడల్ స్కూల్‌గా మార్చేందుకు ప్రణాళికలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పెడపల్లి ఉన్నత పాఠశాలను మోడల్ స్కూల్‌గా మార్చేందుకు ప్రణాళిక సిద్ధమైందని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ పేర్కొన్నారు. శనివారం ఆయన పెడపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో న్యూట్రిన్ గార్డెన్, వంటగది, స్టోర్ రూమ్, కోడిగుడ్లు, ప్రహరీ, వివిధ తరగతులను పరిశీలించారు. విద్యార్థులకు సురక్షమైన తాగునీరు అందజేయాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకం ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్క నాటి నీరు పోశారు. విద్యార్థులకు వన సంరక్షణకు తీసుకోవాల్సిన బాధ్యతలపై వివరించారు. సర్వ శిక్ష అభియాన్ ఇంజినీర్ల ద్వారా పాఠశాలకు నీటి కొళాయిలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలని డిఇఒను ఆదేశించారు. అందుకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఆరో తరగతి ఏ సెక్షన్ తరగతులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాల సాధనలో ప్రజలంతా భాగస్వామ్యులు కావాలన్నారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్త, డంపింగ్ యార్డులను పూర్తిగా తొలగించే చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో కిష్టప్ప, మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ జెడి శుభ దాస్, ప్రధానోపాధ్యాయులు రమామణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి : ఎస్పీ

ప్రతి ఒక్కరూ ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటారో కార్యాలయాలు, పరిసరాలనూ అలాగే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ వి.రత్న పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందితో కలిసి ఎస్పీ చీపురు పట్టి కార్యాలయ ఆవరణాన్ని శుభ్రపరిచారు. ఎస్పీ మాట్లాడుతూ మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే అందరూ ఆరోగ్యంగా ఉండడంతోపాటు ప్రశాంతమైన వాతావరణం నెలకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్‌బిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఏవో సుజాత, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, ఆర్‌ఐ మహేష్, ఎస్‌బిఎస్‌ఐ ప్రదీప్ కుమార్, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.



చిన్నారి మనసంతా.. కేరింత

అదే జోరు.. అదే ఉత్సాహం.. బాలోత్సవ వేదికగా రెట్టించిన ఆనందంతో చిన్నారులు ప్రదర్శనలు చేశారు. ఆద్యంతం కేరింతలు కొడుతూ ఒకరిని మించి ఒకరు ప్రదర్శనలు చేశారు. ఆటపాటలు, నృత్యరూపాలు, కళానైపుణ్యాలు, అద్భుతమైన తెలివితేటల నడుమ అనంత బాలోత్సవ ప్రాంగణం మురిసిపోయింది. కళాత్మక ప్రదర్శనలతో కనులవిందు చేశారు. సైన్స్ ప్రదర్శనలతో అందరిని ఆలోచింప జేశారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలతో అబ్బురపరిచారు. వందలాది మంది చిన్నారులు ఒక్క చోట చేరి 'అనంత' పండుగను కనుల ముందుకు తెచ్చారు. అనంతపురం లలిత కళాపరిషత్, గిల్డ్ఆఫ్ సర్వీస్ స్కూల్ వేదికగా జరుగుతున్న అనంత బాలోత్సవం-5లో రెండవ రోజు శనివారం రెట్టించిన ఉత్సాహంతో చిన్నారులు ప్రదర్శనలు చేశారు.

- ◆ 2వ రోజూ ఊపుతగ్గని బాలోత్సవాలు
- ◆ రెట్టించిన ఉత్సాహంతో పిల్లల ప్రదర్శనలు
- ◆ ఆట,పాట సృజనాత్మకత మేళవింపు
- ◆ ఆద్యంతం చిన్నారుల మోములో ఆనందం
- ◆ బాలోత్సవం నిర్వహణపై హర్షాతిరేకాలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత బాలోత్సవ ప్రాంగణం రెట్టించిన ఉత్సాహంతో 2వ రోజు కొనసాగింది. పిల్లల మోములో ఆనందం, తల్లిదండ్రుల కళ్లల్లో చెప్పలేనంత సంతోషంతో బాలోత్సవ ప్రాంగణం కళకళలాడింది. వేలాది మంది 'అనంత'భావిభారత విజ్ఞాన సంపన్నులు బాలోత్సవ వేదికల మీద సాక్షత్కరించారు. విద్యార్థులు వారి ప్రదర్శనకు అనుగుణంగా అందంగా అలంకరించుకుని ఆకట్టుకునేలా పలు వేషధారణలో చేసిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులతో కేరింతలతో ఎల్‌కెపి ప్రాంగణం మార్మోగింది. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడంతో తమకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని బాలబాలికలు ఆనందం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యార్థులు అలుపూసొలుపు లేకుండా పోటాపోటీగా ప్రదర్శనలు చేశారు. అడకమిక్, కల్చరల్ పోటీల్లో వందల సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వారి తెలితేటలతో అందరినీ ఆకట్టుకున్నారు. డాన్స్ పోటీలు ఉద్రూతలూగించాయి. నాటిక ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. జానపద నృత్యాలు, దేశభక్తి గీతాలు, లఘు నాటికలు క్లాసికల్ డాన్స్, ఏకపాత్రాభినయం తదితర విభాగాల్లో చిన్నారులు చూపిన ప్రతిభ ఆద్యంతం సంబరాన్ని తెచ్చిపెట్టింది. అకడమిక్‌లో వార్త రచన, మ్యాప్, వక్తృత్వ పోటీలు, క్విజ్ తదితర విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొని ప్రతిభాను చాటారు.



పాటపాడుతున్న చిన్నారి

ఆటపాటలూ అవసరమే

కెనెరా బ్యాంకు రీజినల్ ఎజిఎం లారెన్స్

విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలు కూడా అవసరం అని కెనెరా బ్యాంకు రీజినల్ ఎజిఎం లారెన్స్ తెలిపారు. 2వ రోజు బాలోత్సవం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు, గురువులను పిల్లలు గౌరవించాలన్నారు. గెలుపోటములను పక్కన బెట్టి ఇలాంటి పోటీల్లో పాల్గొనేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న అనంత బాలోత్సవ కమిటీకి అభినందనలు తెలిపారు. అనంతరం బాలోత్సవ కమిటీ ఛైర్మన్ షమీమ్ షఫీవుల్లాతో కలిసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎస్‌బిఎన్ విద్యా సంస్థల కార్యదర్శి నిర్మలమ్మ, ప్రభుత్వాసుపత్రి నర్సింగ్ సూపరింటెంటెట్ శంకుతల, మానవత రక్తదాతల సంస్థ తరిమెల అమరనాథ్‌రెడ్డి, వీర రాఘవరెడ్డి, నాట్యాగురువు పట్నం శివప్రసాద్, సాయి ట్రస్ట్ అధినేత విజయసాయి కుమార్, రచయిత కంబదూరు షేక్ నబీరసూల్, బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి, కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, లింగమయ్య, గోవిందురాజులు, కోటేశ్వరప్ప పాల్గొన్నారు.

చిన్నారులకు తోడుగా బాలోత్సవ కమిటీ

బాలోత్సవాలను నిర్వహిస్తున్న బాలోత్సవ కమిటీ చిన్నారులకు తోడుగా నిలుస్తోంది. పోటీల్లో పాల్గొనే పిల్లల పేర్ల నమోదు దగ్గర నుంచి వారి ప్రదర్శన, బహుమతులు అందించేంత వరకు కమిటీ సభ్యులు దగ్గరుండి అన్నీ చూసుకుంటున్నారు. చిన్నారులకు ఎలాంటి కష్టం లేకుండా వాలంటీర్లు వారి ప్రదర్శనలకు సాయం అందిస్తున్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన, కార్యక్రమాలను తిలకించేందుకు వచ్చిన వారందరికీ బాలోత్సవ ప్రాంగణంలోనే భోజన వసతిని ఏర్పాటు చేశారు. బాలోత్సవం నిర్వహణ బాగుదంటూ ప్రదర్శనలు చేస్తున్నా చిన్నారులే కాక అక్కడికొచ్చిన జనమంతా హర్షం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న కెనెరా బ్యాంకు రీజినల్ ఎజిఎం లారెన్స్



బహుమతులు అందిస్తున్న అథితులు

8న జాతీయ మెగా లోక్ అదాలత్

సమన్వయంతో కేసులను పరిష్కరిద్దాం - సమీక్షా సమావేశంలో అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించి మార్చి 8వ తేదీన జరిగే మెగాలోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిద్దామని అదనపు జిల్లా న్యాయమూర్తి కంపల్లె శైలజ సూచించారు. శనివారం స్థానిక అదనపు జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ మెగా లోక్ అదాలత్‌పై సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యలతో కలిసి న్యాయవాదులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో తరహానే అందరూ సమిష్టిగా కేసులను అధికంగా పరిష్కరించేందుకు కషి చేయాలన్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందని, లక్ష్యాలను మించి కేసులను పరిష్కరించాలని కోరారు. రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న ప్రతి కేసునూ పరిష్కరించేందుకు కషి చేయాలన్నారు. పోలీసులు, న్యాయవాదుల పరిధిలో కేసు పరిష్కారం కానిపక్షంలో తమ దష్టికి తీసుకురావాలన్నారు. ముందస్తు లోక్ అదాలత్‌ను నిర్వహించి కక్షిదారులతో నేరుగా చర్చించి నిబంధనలకు లోబడి కేసులను పరిష్కరించనున్నట్లు ఆమె తెలిపారు. సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు పరిధిలో ఉన్న కేసులు, మునిసిపాల్టీ, ప్రమాద బీమా, రాజీ అయ్యేందుకు అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను సైతం పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో సిఐలు రాజగోపాల్ నాయుడు, ఆంజనేయులు, జనార్ధన్ లతోపాటు న్యాయవాదులు పీవీ.శ్రీనివాస్ రెడ్డి, సిద్ధూ, నాగేంద్ర, చిలమత్తూరు, లేపాక్షి, పరిగి మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో చర్చిస్తున్న అదనపు జిల్లా జడ్జి శైలజ, చిత్రంలో న్యాయమూర్తులు శ్రీధర్, లలితా లక్ష్మీ హారిక, రమణయ్య

అగళిలో వైసిపికి బిగ్ షాక్

ఎంపిపి, వైస్ ఎంపిపి, ఎంపిటిసిలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-మడకశిర

అగళి మండలంలో వైసిపికి భారీ షాక తగిలింది. ఎంపిపి రేణుక కామరాజు, వైస్ ఎంపిపి హేమంతరాజు, ఎంపిటిసిలు నాగరాజు, సురేష్, సీనియర్ నాయకులు గోవిందప్ప ఆ పార్టీకి రాజీ నామా చేశారు. వారితో పాటు 200 వైసిపి కుటుంబాలు శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయం లో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పసుపు కండువా వేసుకున్నారు. చేరిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం లో జరుగుతున్న అభివృద్ధిని చూపి టిడిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, విఎం.పాండురంగప్ప, రాష్ట్ర రైతు కార్యదర్శి సురేష్, జడ్పిటిసి ఉమేష్, గురుమూర్తిస్వామి, సర్పంచి నరసింహమూర్తి, మండల కన్వీనర్లు కుమార్‌స్వామి, లక్ష్మీనారాయణ, మద్దనకుంటప్ప, గణేష్, నాయకులు శ్రీనివాస్, నరసింహప్ప, బసవరాజు, శివకుమార్, నాగరాజు, నరేష్‌కన్నా, ప్రధాన కార్యదర్శి రంగేగౌడ్, శివప్ప, షౌకత్, మంజు, చరణ్ పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన ఎంపిపి, వైస్ ఎంపిపి, వైసిపి కార్యకర్తలతో ఎమ్మెలే ఎంఎస్.రాజు, గుండుమల తిప్పేస్వామి

18న బహిరంగ వేలం

హిందూపురం : హిందూపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈనెల 18న స్టేషన్ ఆవరణంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సిఐ రామ్ మోహన్ శనివారం తెలిపారు. ఆసక్తి గలవారు బహిరంగ వేలంలో పాల్గొనాలని తెలిపారు. వేలం ముగిసిన అనంతరం హెచ్చు పాటదారులకు వాహనాలను ఇవ్వడంతో పాటు నిబంధనల మేరకు వాహనాలకు నూతన రికార్డులు ఇస్తామన్నారు.

ప్రభుత్వాసుపత్రి పరిశీలన

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని శనివారం ఎంపి బికె.పార్థసారధి, బెల్ కంపెనీ ప్రతినిధులు శశి భూషణ్, అశోక్, రవితో కలిసి పరిశీలించారు. ఎంపి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఆసుపత్రి భనవ నిర్మాణాలను పునాదుల వరకూ చేపట్టి ఆ తర్వాత వదిలేయడం వారి చేతగానితనానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈ ఆసుపత్రి భవనాల నిర్మాణానికి బెల్ కంపెనీ సహకారం అందించాలని కోరారు. సోమందేపల్లి మండలంలో బెల్ కంపెనీ నిర్మిస్తున్నారని, ఈ కంపెనీ ద్వారా అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు మాట్లాడుతూ ఈ ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక వైద్యులు, సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎంపితో పాటు బెల్ కంపెనీ యాజమాన్యం ఈ ఆసుపత్రి భవనాల నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. వారి వెంట నాయకులు జీవీపీ నాయుడు, డాక్టర్ సోమశేఖర్, సిబ్బంది ఉన్నారు.



బెల్ కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎంపి పార్థసారధి

రోడ్డు నిబంధనలను పాటిద్దాం : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రోడ్డు నిబంధనలను పాటించి ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ వి.రత్న సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా ప్రజా రవాణా అధికారి టి.మధుసూదన్ ఆధ్వర్యంలో డిపో గ్యారేజ్‌లో శనివారం నాడు జిల్లాలోని డిపో మేనేజర్లు ట్రాఫిక్, గ్యారేజ్, పర్సనల్, అకౌంట్స్ సూపర్ వైజర్లు, యూనియన్ అసోసియేషన్ సభ్యులతో రోడ్డు భద్రతా వారత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు ఆర్డీవో ఎన్ఎన్.కరుణ సాగర్ రెడ్డి, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటరీ జిబి.విశ్వనాథ్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్లు రహదారి భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారి టి.మధుసుధన్ మాట్లాడుతూ జిల్లాలోని డిపోలోని డ్రైవర్లకు రహదారి నియమాలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలన్నారు. అనంతరం డ్రైవింగ్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన డ్రైవర్లకు శాలువా, మోమెంటో, అప్రిషియేషన్ లెటర్, నగదు బహుమతి అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఎన్ఎన్.కరుణ సాగర్ రెడ్డి, డిపో మేనేజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : రహదారి భద్రత మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం నిర్వహించిన రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాహనదారులు విధిగా హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. చట్టాన్ని గౌరవించండి.. రహదారి భద్రత ఉద్యమంలో భాగస్వాములు అవ్వండి- ప్రమాదాలు అరికట్టండి అని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ విఎస్ శర్మ, ఆర్టీవో శ్రీనివాసులు, టిడిపి నాయకులు పివి.పవన్‌కుమార్‌రెడ్డి, కృష్ణమోహన్‌నాయుడు, డైమండ్ ఇర్ఫాన్, అనిల్‌కుమార్‌రెడ్డి, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-హిందూపురం

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ తెలిపారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 3, 4, 5,6,7,29 వార్డుల పరిధిలో కమిషనర్ సంఘం శ్రీనివాసులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే హిందూపురం పట్టణాన్ని పరిశుభ్రమైన పట్టణంగా తీర్చిదిద్ది ప్రథమ స్థానంలో నిలపాలనే లక్ష్యంతో మున్సిపల్ సిబ్బంది పని చేయాలని సూచించారు. ఇందుకు ప్రజలూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జెపికె.రాము, మున్సిపల్ డిఈ మోహన్, ఎఈలు శంకర్, జనార్ధన్, ఆకౌంట్స్ ప్రత్యేక అధికారి శోభన్ రెడ్డి, మెప్మా డిఎంసి గంగులయ్య, సిఒలతో పాటు శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, పాల్గొన్నారు.

పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రి కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి ఆధ్వర్యంలో స్వచ్ఛంధ్ర కార్యక్రమం చేపట్టారు. పరిశుభ్రతకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.వెంకటేశులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, వాటర్ సెక్రటరీ ఉపేంద్ర, స్వచ్ఛ ఆంధ్ర కమిటీ సభ్యులు సరస్వతి, నోడల్ ఆఫీసర్ రంగనాయకులు పాల్గొన్నారు. రూరల్ మండలం బిట్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గోన్నారు.



వార్డుల్లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఛైర్మన్, కమిషనర్

మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షిలో జరిగి మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ కమిటీ ఛైర్మన్ కరణం రమానందన్, ఆలయ కార్య నిర్వహణ అధికారి నర్సింహమూర్తి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆయన వ్యక్తిగత కార్యదర్శి బాలాజీకి అందజేశారు. పెద్ద ఎత్తున నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు అధిక సంఖ్యలో ప్రజలు, భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ ఏడాది లేపాక్షి పురవీధుల గుండా ఊరేగింపు, శివపార్వతుల బ్రహ్మరథోత్సవం ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిమ్మయ్య, దుర్గా నాని తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ బాల్‌లో ఎల్ఆర్‌జి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 10వ తేదీన అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ముగిసిన ఖేలో ఇండియా అస్మిత అండర్-13 బాలికల ఫుట్ బాల్ పోటీలలో హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్న ఎల్ఆర్‌జి విద్యార్థినులు ప్రతిభ చాటారు. అండర్ -13 బాలికల ఫుట్ బాల్ జట్టులో పాల్గొని విజేతలుగా నిలిచారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను విద్యా సంస్థల సెక్రటరీ బాల సుందరం, ఎఒ సంజీవ రెడ్డి, హెచ్ఎం ప్రసాద్, ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జెవి.అనిల్ కుమార్, ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి సలీం అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు విజయభాస్కర్ రెడ్డి, హరీష్, హరీష్ కుమార్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎల్ఆర్‌జి విద్యాసంస్థల కార్యదర్శి బాల సుందరం, ఎఓ, హెచ్ఎం

ప్రజాశక్తి
www.prajasakti.com

కార్పొరేట్లకు కాసుల వెలుగులు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి




ప్రకృతి వైపరీత్యం ఇక్కడి ప్రజలకు శాపమైతే... కార్పొరేట్లకు మాత్రం కార్పొరేట్ వెలుగులు పంచిపెడుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా భౌగోళికంగా ఎత్తైన ప్రాంతం కావడంతో గాలులు నిరంతరంగా వీయడంతో కురవాల్సిన మేఘం కురవకుండా సుదూరం పోతోంది. దీంతో వర్షాలు సరిగా లేక ఇక్కడ వ్యవసాయంపై ఆధారపడిన రైతాంగం పూర్తి స్థాయిలో నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ శాపమే కార్పొరేట్లకు మాత్రం వరంగా మారింది. బలమైన గాలులకు పవన విద్యుత్ ఉత్పత్తి జోరుగా సాగుతుండగా, వర్షాభావంతో ఉండే ఎండ సౌర విద్యుత్ ఉత్పత్తికి అనుకూలంగా మారింది. దీంతో ఎక్కడా లేని విధంగా పెద్దఎత్తున న్యూ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టులు వస్తున్నాయి. దీని వలన స్థానికంగా ఉపాధి లభిస్తుందా అంటే పెద్దగా ఉండటం లేదు. పైగా వీటి ఏర్పాటు భూములు పెద్దఎత్తున సేకరిస్తుండటంతో రైతు భూమిని కోల్పోయి ఇతర పనుల్లోకి వెళ్లే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే చాలా వరకు చూస్తే పవన, విద్యుత్ ప్లాంట్స్ ఏర్పాటు చేసియున్నారు. ఇప్పటి వరకు ఏర్పాటైన వరకు చూస్తే ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1779 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు అయ్యాయి. 3003 మెగావాట్ల పవన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటికి ఒక మెగావాట్‌కు నాలుగు నుంచి ఆరు ఎకరాల భూమిని ఆ సంస్థలు సేకరిస్తున్నాయి. దీని ప్రకారం చూస్తే ఇప్పటి వరకు సేకరించిన భూమియే సుమారు 20 వేల ఎకరాల వరకు ఉంది. ఇప్పుడున్న వరకే కాకుండా మరిన్ని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులిచ్చి యున్నారు. వీటికి సుమారు మరో 20 వేల ఎకరాలకు ఉన్నాయి. ఇంకా వచ్చే అవకాశముంది. ఈ ప్రకారం జిల్లాలో పెద్దఎత్తున భూసేకరణ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కేటాయించే అవకాశముంది. గతంలో ఎలా నేరుగా కొనుగోలు కాకుండా లీజు పద్ధతిలో రైతుల నుంచి సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం చూస్తే ఎకరానికి రూ. 31 వేల వరకు ఇవ్వాలని నిర్ణయించింది. ఆయా సంస్థలకు మాత్రం విద్యుత్ ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయం సమకూరుతోంది. రైతుకు మాత్రం భూమి లేకుండాపోతోంది. తద్వారా రైతుకు ఉపాధి లేని పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా ఈ వారంలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు కేటాయించిన భూములు చూస్తే సత్యసాయి జిల్లా ముదిగుబ్బ ప్రాంతంలోనూ, కనగానపల్లి, రామగిరి, కళ్యాణదుర్గం, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అనుమతిచ్చింది.. ఈ రకంగా ప్రకృతి రైతుకు శాపమైతే... కంపెనీలకు మాత్రం కాసులు కురిపించేదిగా మారింది. లీజు ఏడాదికి రూ.31 వేలు కాకుండా మరింత పెంచాలని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అదేవిధంగా వాటి ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

రెవెన్యూ అధికారుల చొరవతో భూసమస్య పరిష్కారం

10 సెంట్లు అంగన్వాడీ భవనానికి ఇచ్చిన వారసులు

ప్రజాశక్తి-పెనుకొండ

నకిలీ పత్రాలతో కాజేసిన భూమిని వారసులకు అప్పగించి పెనుకొండ రెవెన్యూ అధికారులు విధి నిర్వహణలో నిబద్ధతను చాటుకున్నారు. బాధితుడు కెవి. చలపతిరావు తెలిపిన వివరాలు.. మండలంలోని బొజ్జారెడ్డిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 28-2లో 28 సెంట్ల భూమిని తన తాత వెంకోభరావు తన తల్లి సరోజమ్మకు పసుపు కుంకుమ కింద రాసివ్వగా 2000 సంవత్సరంలో రెవెన్యూ అధికారులు సరోజమ్మ పేరుపై పట్టాదారు పాసు పుస్తకం జారీ చేశారు. ఆ తర్వాత సరోజమ్మ కుమారులతో కలిసి హిందూపురంలో నివాసం ఉంటుంది. ఈ భూమిని శెట్టిపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి నకిలీ పత్రాలు సృష్టించి అతని భార్య పేరుపై బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించాడు. ఈ విషయం తెలిసి కెవి.చలపతిరావు తమకు న్యాయం చేయాలని ఆర్డీవోను ఆశ్రయించాడు. దీంతో స్పందించిన రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించి, సర్వే చేయించి అసలైన వారసులు చలపతిరావుకు భూమిని చూపించారు. కాగా ఆ 28సెంట్ల భూమిలో 10 సెంట్లను అంగన్వాడీ భవన నిర్మాణానికి ఇస్తున్నట్లు కెవి చలపతిరావు తెలిపారు.



భూమి పత్రాలు చూపుతున్న కెవి.చలపతిరావు

డైక్లాట్ ఆధారంగా వారసులకు భూమి చూపాం - తహాశీల్దార్ శ్రీధర్

డైక్లాట్ ఆధారంగా రికార్డులను పరిశీలించి అసలైన వారసులకు భూమిని చూపాం. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి వెంకోభరావుకు చెందింది. రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆయన కుమార్తె సరోజమ్మకు ఈ భూమిపై సర్వ హక్కులు ఉన్నట్లు తేలింది. దీంతో రెవెన్యూ అధికారులు భూమిని సర్వే చేసి హద్దులు చూపాము.

చంద్రబాబుతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

ప్రజాశక్తి-బుక్కపట్నం

కూటమి ప్రభుత్వంతోనే స్వర్ణాంధ్ర సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రాయునిపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన చంద్రాయునిస్వామి తడక మహోత్సవంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాఘ మాసంలో మూడో శనివారం తడక మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ అని, అందులో భాగంగా స్వామి వారికి మొక్కు తీర్చుకొని నూతన వస్త్రాలు అందజేశామన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ఎపిని స్వర్ణాంధ్రగా మార్చేందుకు చిత్తశుద్ధితో పని చేస్తున్నారన్నారు.




చంద్రాయునిస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి

వెలుగు కార్యాలయంలో శిక్షణ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక వెలుగు కార్యాలయంలో క్రాంతి మండల సమాఖ్య, మండల మహిళా సమైక్య ఈసి సభ్యులకు రెండో రోజైన శనివారం శిక్షణ కార్యక్రమం కొనసాగింది. ప్రాజెక్టు ఉద్దేశం, మండల సమాఖ్య ఆవశ్యకత, ఈసీ మీటింగ్ అజెండా, విధులు, బాధ్యతలు, తదితర అంశాలపై స్టేట్ రీసోర్స్ పర్సన్ ఈశ్వరమ్మ, సరస్వతి శిక్షణ ఇచ్చారని ఎపిఎం హేమలత తెలిపారు. కార్యక్రమంలో కదిరి ఏరియా కోఆర్డినేటర్ వెంకటనారాయణ, మండల మహిళా సమాఖ్య కార్య నిర్వహణ వర్గం, ఇసి సభ్యులు, సీసీలు అశ్వత్థరెడ్డి, రామాంజనేయులు, రామచంద్ర, మల్లికార్జున, చంద్రమోహన్‌రెడ్డి, అకౌంటెంట్ సుశీల పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎపిఎం హేమలత

డిజిటల్ అసిస్టెంట్‌ను దూషించడం తగదు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

రూరల్ పరిధిలోని పోతుకుంట గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌ను దుర్భాషలాడిన సంఘటనను తహశీల్దార్ నటరాజ్, ఎంపిడిఒ సాయి మనోహర్, రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో ఖండించారు. మండలంలోని ప్రభుత్వ ఉద్యోగుల భద్రత, శ్రేయస్సును కాపాడటానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులపై దురుసు ప్రవర్తన, దాడులను సహించబోమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో ప్రతి ఒక్కరూ పద్ధతిగా వ్యవహరించాలన్నారు.

రేపు చింత చెట్ల ఫలసాయం వేలం

లేపాక్షి : మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలో ఉన్న చింత చెట్ల ఫల సాయాన్ని ఈ నెల 17వ తేదీ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం వేస్తున్నట్టు సర్పంచి అశ్వత్థనారాయణ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొన వచ్చని పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య తెలిపారు.

క్లస్టర్ సమావేశాల సమయం పెంపుపై నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

క్లస్టర్ సమావేశాల సమయాన్ని పెంచడాన్ని నిరసిస్తూ శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్లస్టర్ రిసోర్స్ సెంటర్‌లో యుటిఎఫ్, ఎపి ఎస్‌టిఎ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఎపి ఎస్‌టిఎ రాష్ట్ర అధ్యక్షులు కాడి శెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల నిర్వహణ సమయంపై ప్రభుత్వం, అధికారులు నియంతృత్వ ధోరణితో వ్యవహరించడం సరైన నిర్ణయం కాదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, సి.నరేష్, పి.కృష్ణానాయక్, పి.హసీనాబేగం, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోనే నిర్వహించాలి: వైఎస్ఆర్‌టిఎ

పుట్టపర్తి క్రైమ్ : ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని నిర్ణీత సమయంలో అమలు చేయాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పివి.రమణారెడ్డి, జయచంద్ర ప్రసాద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సమావేశం సమయాన్ని మార్చడం తగదన్నారు. ఇలాంటి విషయాలను జిల్లా అసోసియేషన్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



పెనుకొండలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

మున్సిపాలిటీ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆదేశించారు. పుట్టపర్తిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. పట్టణంలో శనివారం ఛైర్మన్ ఓబుళపతి అధ్యక్షతన మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యసాయి శత జయంతి ఉత్సవాల ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. పన్నుల వసూలు, అక్రమ కట్టడాలను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని అసహనం వ్యక్తం చేశారు. కర్నాటక నాగేపల్లి నుంచి సాయినగర్ మీదుగా వెస్ట్ గేట్ వరకూ, బ్రాహ్మణపల్లి తండా కెఎన్.పల్లి రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కోవెలగుట్టపల్లి, బీడుపల్లి, గోకులం, తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు, నీరు, పారిశుధ్యం నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు సూర్యగౌడ్, జయప్ప, తదితరులు ఫిర్యాదు చేశారు. డస్ట్ బిన్‌లకు రూ. 18 లక్షలు మంజూరు కాగా ఒక్కటి కూడా లేవని రత్నప్ప చౌదరి ధ్వజ మెత్తారు. చెత్త తొలగించే బండ్లు 4 మాత్రమే ఉన్నాయన్నారు. ఎక్కడా ఫాగింగ్ చేయడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మార్చి 1వ తేదీ లోపు ఆయా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రహ్లాద, ఏఈ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూర

ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం : ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు : ప్రజల సమస్యల పరిష్కారం కోసం జవాబుదారీగా పని చేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక ఐటిఐ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌లో ఆమె పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ అధికారులు ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దన్నారు. అర్జీ ఇచ్చిన వారంలోపు పరిష్కారం చూపాలని ఆదేశించారు. నియోజకవర్గంలో ఐటి పరిశ్రమల ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ఉద్యోగులు విధులు నిర్వర్తించాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీ రాగానే సాగుదారులకు పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, డీఎస్పీ విజయ్ కుమార్, సిఐ నరేంద్రరెడ్డి, తహశీల్దార్ ఆనందఆచారి, ఎంపిడిఒ విల్సన్, ఎస్ఐ వెంకటనారాయణ, నియోజవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పత్తి చంద్రశేఖర్, టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, పిట్టా ఓబుల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్, పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకి వినతి

ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ మండలంలోని వీరప్పగారిపల్లి అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఆమెతో పాటు సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు వివి రమణ, ప్రాజెక్ట్ కార్యదర్శి రంగమ్మ ఉన్నారు. వారు మాట్లాడుతూ అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు, వెంకటేష్ అంగన్వాడీ కార్యకర్త నాగమణిపై వేధింపులు, దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, ఆమెకు ఉద్యోగ భద్రత, రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కుళ్లాయప్ప, మణిమాల, వరలక్ష్మి, సునీతా బాయ్ పాల్గొన్నారు.



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న కృష్ణమూర్తి

'పుల్వామా' వీర సైనికులకు నివాళి

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పుల్వామా ఘటనలో మృతి చెందిన వీర సైనికులకు శనివారం పట్టణంలోని ఆదర్శ సేవా సంఘం, ఆదర్శ పార్కు కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తి, చెన్న సూర్యప్రకాష్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వీర సైనికులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. పుల్వామా దాడి మన దేశానికి చీకటి రోజు అన్నారు. అనంతరం పట్టణంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గుద్దిటి నాగార్జున, నాగభూషణం, మారుతికుమార్, నాగరాజు పాల్గొన్నారు.

17 నుంచి మస్తాన్ వలి ఉరుసు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకూ పట్టణంలోని హజరత్ సయ్యద్ షా మస్తాన్ వలి ఉరుసు మహోత్సవం నిర్వహిస్తామని స్టేట్ వక్ఫ్ బోర్డు సభ్యులు, ముస్లింలు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ సాయంత్రం చాదర్ గలఫ్ ఎక్కించుట, రాత్రి గంధం పూజ, 18 రాత్రి దీపారాధన, కవాలి, 19న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. దర్గా ప్రాంతాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరిస్తామని, హిందూ ముస్లింలు ఉరుసు మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు పుట్టపర్తిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని మంగళకర జూనియర్ కళాశాలలో ఆదివారం జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నామని, అందులో సుమారు 50 కంపెనీలు పాల్గొని సుమారు 2వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఆపై ఉన్నత విద్యనభ్యసించిన నిరుద్యోగులు హాజరుకావాలని కోరారు.

వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-మడకశిర

రొళ్లలో ఏర్పాటు చేసిన కురుక్షేత్ర నాటక ప్రదర్శనకు వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దీంతో శుక్రవారం రాత్రి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కళాకారులు శివప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. శివప్రసాద్ మాట్లాడుతూ కనుమరుగవుతున్న కళలను ప్రోత్సహిస్తున్న కళాకారులను అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న మహాలక్ష్మి ప్రథమ చికిత్స కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు మా మెడికల్ స్టోర్ యజమాని ఫిరోజ్ తెలిపారు. ఒడిసిలో శనివారం ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరంలో కోలార్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సంజన, డాక్టర్ నవ్యశ్రీ, డాక్టర్ అనసూయ, డాక్టర్ సాయికుమార్ అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు.

'ప్రజా ఫిర్యాదుల వేదిక'ను సద్వినియోగం చేసుకోండి

ఆర్డీవో మహేష్

ప్రజాశక్తి-ధర్మవరం

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో మహేష్ సూచించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్‌లోని పరిధిలోని 7 మండలాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తా మని తెలిపారు. ఇందులో డివిజన్ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు తప్పక హాజరవుతారన్నారు. ఏ సమస్యనైనా విచారణ చేపట్టి, ప్రకటించిన షెడ్యూల్ తేదీలోపు పరిష్కారం చూపుతారని తెలిపారు.

మెగా జాబ్ మేళాలో 400మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం పట్టణం లోని మధుగిరి రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్‌మేళాలో 50కి పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 1300 మందికి పైగా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. 400కు పైగా అభ్యర్థులు ఉద్యోగాలు పొందారు. మరో 300కి పైగా అభ్యర్థులు షార్ట్ లిస్ట్ అయ్యారు. ఎమ్మెల్యే జాబ్‌మేళా జరుగుతున్న తీరును పరిశీలించి మీడియాతో మాట్లాడారు. వైసిపి హయాంలో ఉద్యోగావకాశాలు లేక యువత వలస పోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక యువతకు అనేక ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు. తిప్పేస్వామి మాట్లాడుతూ జగన్ దుర్మార్గపు పాలన రాష్ట్ర యువత భవిష్యత్తుకు శాపంగా మారిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించి యువత భవిష్యత్తుకు బంగారుబాటలు వేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, నాయకులు పాండురంగప్ప, లక్ష్మీనారాయణ, మద్దలకుంటప్ప, గణేష్, కుమారస్వామి, దాసిరెడ్డి, సర్పంచి నరసింహమూర్తి, బిఎస్.గురుమూర్తి, పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

గిరిజన, లంబాడీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సంత్‌సేవాలాల్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రశాంతి గ్రామ్‌లో ఆ సమితి రాయలసీమ జోనల్ కార్యాలయంలో నాయకులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. రాష్ట్ర లంబాడీ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు రవినాయక్ మాట్లాడుతూ సేవాలాల్ జయంతి రోజును ప్రభుత్వం సెలవుగా ప్రకటించి అధికారికంగా నిర్వహించాలన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో సేవాలాల్ ఆలయం నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, గిరిజన భాషలను ప్రభుత్వం గుర్తించి ఏదో ఒక షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడుల ను అరికట్టి ప్రత్యేక విచారణకు ఆదేశించాలన్నారు. ఎస్టీ కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు విజయకుమార్‌నాయక్, మోహన్‌నాయక్, జిల్లా కమిటీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమేష్ నాయక్, గణేష్‌నాయక్, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, బాలాజీనాయక్, శ్రీరాములు నాయక్ పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న లంబాడీ నాయకులు

రహదారి భద్రత నియమాలు పాటిద్దాం : ఎంవిఐ



సదస్సులో మాట్లాడుతున్న ఎంవిఐ జయశ్రీ

ప్రజాశక్తి-హిందూపురం

రహదారి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ జయశ్రీ విద్యార్థులకు సూచించారు. 36వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం హిందూపురం రూరల్ మండలం ఎల్ఆర్‌జి విద్యాలయంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంబిఐ జయశ్రీ, అసిస్టెంట్ ఎంవిఐ ఉదయ్ కుమార్ నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనంలో బయటకు వెళ్లే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో సంజీవరెడ్డి, పీడీలు విజయ భాస్కర్ రెడ్డి, హరీష్, హరీష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్'లక్ష్యం

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

పర్యావరణ పరిరక్షణే 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్'లక్ష్యమని, పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) సమత సూచించారు. 'స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్'లో భాగంగా శనివారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు సహకరించాలని కోరారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది ప్ల కార్డులతో వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ఆవశ్యకతను తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచి రాధానాగరాజు, ఎంపీడీవో నటరాజ్, ఎంఇఒ జయచంద్ర, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం వాణిబాయ్, ఉపాధ్యాయులు విశ్వేశ్వర రావు, ఇర్షాద్‌వలి, శివారెడ్డి, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



తడి, పొడి చెత్త గురించి అవగాహన కల్పిస్తున్న డిపిఒ సమత

బత్తలపల్లి : ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను స్వచ్ఛతకు ప్రతీకలుగా తీర్చిదిద్దాలని ఎంపిడిఒ నరసింహనాయుడు సూచించారు. ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఎంపిడిఒతో పాటు ఏవో శ్రీనివాసులు, ఈవోఆర్డీ క్రిష్టప్ప, సిబ్బంది చీపుర్లు పట్టి చెత్తను తొలగించారు. పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నాలుగురోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ఎంపిడిఒ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతలో ప్రజలు కూడా భాగస్వామ్యులు కావాలన్నారు. దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్, వ్యర్థాలను తొలగించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు.

టిడిపి నాయకుడు మృతికి నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన టిడిపి మాజీ వార్డు మెంబర్ బోయ గోపి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే టిడిపి నాయకులు వెంకటేశ్వరరావు, పట్టణ కన్వీనర్ శ్రీరాములు వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వారితో పాటు నాయకులు త్రివేంద్రనాయుడు, రమణమ్మ, లక్ష్మిదేవి ఉన్నారు.

జీవ వైవిధ్య పంటలపై సదస్సు

ప్రజాశక్తి-రొద్దం

జీవవైవిధ్య పంటలపై శనివారం మండలంలోని చెరుకూరు గ్రామంలో ఎన్ఎఫ్ఎ సాకప్ప సమక్షంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు గంగాధరప్ప పొలంలో 1.75 ఎకరాల్లో పిఎండిఎస్ పంటను వేసినట్లు వారు తెలపారు. ఇందులో 5 రకాల ప్రధాన పంటలు, 25 రకాల జీవ వైవిధ్య పంటల విత్తనాలను బీజామృతంతో విత్తన శుద్ధిచేసి, ఘనజీవామృతంతో పాటు విత్తారు. అలాగే ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ రైతులతో కలిసి 15 ఎకరాల్లో పిఎండిఎస్‌ను వేస్తున్నట్లు తెలిపారు.

రేపు కదిరిలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' : కలెక్టర్

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఈ నెల 17వ తేదీ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతులు పుట్టపర్తి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవోల ఆధ్వర్యంలో జిల్లా తరఫు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు శనివారం జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని ప్రజలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకూ తమ సమస్యలపై అర్జీలు ఇవ్వాలన్నారు.

కృత్రిమ కాలు కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, కృత్రిమ కాలు కావాల్సిన వారు పేర్లు నమోదు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు బి.వినోద్ శనిరం ఓ ప్రకటన కోరారు. అనంతపురంలోని కార్యాలయంలో మార్చి 1వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా అధికారి నాగముని 8639081464లో సంప్రదించాలని కోరారు.

రేపు అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అంగన్వాడీల సమస్యలపై ఈ నెల 17వ తేదీ స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట చేపడుతున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకుడు వివి రమణ, అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి రంగమ్మ పిలుపునిచ్చారు. ఓడిసిలో శనివారం వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26వేలు, గ్రాట్యూటీ, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు, సంక్షేమ పథకాలు, బకాయి అద్దెలు, టిఎ బిల్లులు, సూపర్వైజర్ పోస్టుల భర్తీ, మెనూ ఛార్జీల పెంపు, ఉచితంగా గ్యాస్ సరఫరా, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కుల్లాయప్ప, ప్రాజెక్ట్ సెక్రటరీ మణిమాల, వరలక్ష్మి , నాగమణి, సునీతబాయ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, వివి రమణ, రంగమ్మ

చోరీ కేసులో నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో సంచలనం రేకెత్తించిన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కోనాపురం రోడ్డులో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు నాగార్జున ఇంట్లో 15 రోజుల క్రితం చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితుడైన అనంతపురం నగరానికి చెందిన సోహెల్‌ను శనివారం పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుడు దొంగలించిన సొత్తును రికవరీ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.